వైద్యులకు రక్షణ కల్పించాలి



ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. పట్టణ, నగరాల్లో పని చేసే వైద్యులకే రక్షణ లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యుల పరిస్థితి ఏమిటి? మహిళా డాక్టర్లు ఆస్పత్రులో విధులు నిర్వహించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. – డాక్టర్ శివారెడ్డి, మదనపల్లె

కఠిన చట్టాలు అవసరం



మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించేవారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలి. ఇటీవలి కాలంలో వైద్యులపై దాడులు జరుగుతున్నాయి. ప్రాణం పోస్తున్న డాక్టర్లకే ప్రాణరక్షణ లేకపోవడం చాలా దారుణం. వైద్యుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. - డాక్టర్ జాహ్నవిరెడ్డి, ములకలచెరువు



నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేసినప్పుడే సమాజంలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. కోల్‌కత్తా వైద్యురాలిపై జరిగిన ఘటన బాధకరం. ఈ ఘటనలోని నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి. డాక్టర్లకు భద్రత, భరోసా కల్పించాలి. -డాక్టర్ అమరసింహరాజు, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకోవాలి



ప్రజలకు సేవలందించే వైద్యులపై దాడులు, అఘాయిత్యాలు జరిగిన సమయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి దుండగులపై చర్యలు తీసుకోవాలి. కోల్‌కోత్తాలో మహిళా వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, పైశాచికంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. - చంద్రశేఖర్, పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

మల్లయ్యకొండకుపై భక్తుల రద్దీ

తంబళ్లపల్లె: శ్రావణ మాసం పురస్కరించుకుని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుదూరప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట: మండలంలోని బడికాయలపల్లె బీసీకాలనీ వద్ద పేకాట జూదమాడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరినుంచి రూ.9,490 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

లాటరీ విక్రేతల అరెస్ట్

మదనపల్లె : నిషేధిత లాటరీ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాల్మీకివీధికి చెందిన శ్రీనివాసులు(45), పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ శంకర(42) నిషేధిత లాటరీలు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 156 లాటరీ టికెట్లు,రూ. 3,693 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మంచిప్రవర్తనతో మెలగాలి

కలికిరి: నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాతనేరస్తులు, రౌడీషీటర్‌లకు సోమవారం సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరచరిత్ర కలిగిన వారు సమాజంలో మంచితో ప్రవర్తనతో వ్యవహరించాలన్నారు. వారు పాల్పడిన నేరాలు, ఇకపై వారు వ్యవహరించాల్సిన తీరును వివరించి, ఇకపై నేరాలకు పాల్పడితే పోలీసు చర్యలపై వివరించారు.

కవి మురళీధర్‌రాజుకు సన్మానం

పీలేరు : భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఎం.వి. కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు టీటీడీ కల్యాణ మండపంలో జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా పీలేరుకు చెందిన కవి మురళీధర్‌రాజు తెలుగు వైభవంపై కవితా గానం చేశారు. దీంతో ఆయన్ను చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్‌మోహన్, సుబ్రమణ్యం శర్మ, జానపద కళాకారులు గోరెటి వెంకన్న, సినీ గేయరచయిత చిన్నికృష్ణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.వి. శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సి. నారాయణస్వామి, దేవేంద్రరావుల చేతుల మీదుగా శాలువలతో సన్మానం, జ్ఞాపిక అందుకున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో పాడిఆవులకు పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువులకు కాళ్ల దగ్గర పుండ్లు రావడం , పశువులు మేత తినకపోవడం వంటి లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధిగా గుర్తించాలన్నారు. వాటి నివారణకు పశువులను శుభ్రంగా కడిగి మంచి ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

తంబళ్లపల్లె: మండలంలో వైరల్, డెంగీ జ్వరాలు రోజు రోజుకు పెరుగుతుండటంతో ముమ్మరంగా పారిశుద్ధ్యం చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం దిగువపల్లె, ఆర్ఎన్ తాండాలలో ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్యచికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. మురుగు నీటి కుంటల్లో అబేట్ పిచికారీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆకట్టుకున్న శ్రీకృష్ణ, గోపిక వేషధారణలు
- భక్తులతో కిటకిటలాడిన గోవర్ధనగిరి

మదనపల్లె సిటీ : శ్రీకృష్ణాష్టమి వేడుకలు మదనపల్లె పట్టణంలో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక అనపగుట్టలోని శ్రీకృష్ణ ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆలయంలో అభిషేకాలు, పూజలు, అర్చనలు జరిగాయి. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం స్నపనోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆకట్టుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో పలు పాటలకు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి.

కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

స్థానిక అనపగుట్టులో వెలసిన శ్రీ కృష్ణ ఆలయంను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, రాటకొండ గురుప్రసాద్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉట్టి కొట్టే కార్యక్రమం

ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉల్లాసంగా జరిగింది. యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీలు పడ్డారు. కొందరు యువకులు చివరకు ఉట్టిని కొట్టారు.



మదనపల్లె: శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణతో చిన్నారులు



మదనపల్లెభక్తులతో కిటకిటలాడిన గోవర్ధనగిరి



శ్రీ కృష్ణుడి వేషధారణలో..

గుర్రంకొండలో..

గుర్రంకొండ: గుర్రంకొండలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం స్థానిక ఇందిరమ్మ కాలనిలో శ్రీకృష్ణ మందిరంలోను, శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయం, గీతాపారాయణ మందిరంలో కృష్ణుడి తమ ఇంటికి ఆహ్వానిస్తూ పిండితో కృష్ణుడి పాదాలు వేశారు. రంగురంగుల పుష్పాలతో కృష్ణుడిని అందంగా అలంకరించి అటుకుల పాయసంతో నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. తులసీచెట్టును కృష్ణుడి వద్ద ఏర్పాటు చేసి తులసి మాతకు పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయాల్లో గీతాపారాయణం కావించారు. అనంతరం చిన్నారుల కృష్ణుని వేషాలు అందర్ని అలరించాయి. చిన్నికృష్ణుడు, గొల్లభామ, గోపికమ్మల వేషాలతో చిన్నారులు అందర్ని అకట్టుకొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలోని పలు ఆలయాలు శ్రీ కృష్ణాష్టమి, శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు, మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేపూరికోట సమీపంలోని శ్రీఆదినారాయణ స్వామి ఆశ్రమంలో వెలసిన శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు వెంకటసుబ్బారెడ్డి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఊలపాడు పంచాయతీ దిన్నిపల్లె , కెసి.పల్లి గ్రామాల్లోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పెద్దన్న వంశీయులు , గ్రామస్తులు, మాజీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రాజేష్, సోము ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే బరిడేపల్లె, ఎలవానెల్లూరు, బల్లసముద్రం గ్రామాల్లో కృష్ణుడి ఆలయాలల్లో పలు రకాల పుష్పాలతో అలంకరించారు. పిల్లలు కృష్ణుడు, గోపికల వేషధారణలు, ఆటల పాటలతో అలరించారు.

ఆట, పాటలతో..

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణ-గోపికలు వేషధారణలో చిన్నారులు భక్తులను ఆట, పాటలతో అలంరించారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పూలతోరణాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు, యువతీ యువకులకు ఉట్టికొట్టడం, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మ శేఖర్‌యాదవ్, కార్యదర్శి చిరంజీవి యాదవ్, కమిటీ సభ్యులు వెంకటేశ్, రమణ, ధన, ప్రకాష్, నగేష్, రెడ్డియాదవ్, ఆనంద, శ్రీనివాసులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని వేడుకగా జరుపుకున్నారు. పలువురు తమ చిన్నారులకు శ్రీకృష్ణ, గోపికల వేషధారణ వేశారు. కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి, గౌతమి దంపతుల కుమారుడు మోక్షిత్‌రెడ్డి శ్రీకృష్ణుడి వేషంలో అలంరించారు. అలాగే పలువురు చిన్నారులు కృష్ణుడి వేషంలో మురిపించారు.



గుర్రంకొండ: గీతా పారాయణం కావిస్తున్న భక్తులు



ములకలచెరువు: వేపూరికోట వద్ద కృష్ణుడి విగ్రహానికి పూజలు



రామసముద్రం: ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలస్వామి



కలకడ: శ్రీకృష్ణ-గోపికల వేషధారణలో చిన్నారులు

వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం

వాల్మీకిపురం : పట్టణ పడమర పొలిమేర ధర్మపథం శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో కృత్తికా నక్షత్రం సందర్భంగా సోమవారం సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు అభిరాం స్వాములు శాస్త్రోక్తంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో బాసింగాధారణ, యజ్ఞోపవితం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, ఎదుర్కోలు ఉత్సవాలను జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ,అన్నప్రసాద వితరణ చేశారు. స్వామి వారు కల్యాణోత్సవం సందర్భంగా మదనపల్లికు చెందిన జీఆర్‌టి జ్యూవెలర్స్ సంస్థ వారు ప్రసాదం, బ్యాగులు, కుంకుమ కవర్లకు వితరణగా అందజేశారు.



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు

మదనపల్లె సిటీ: జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానం దక్కించుకున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు దిలీప్‌కుమార్, సాగర్, కమలేష్ తెలిపారు. విజయవాడలోని విఆర్ సిద్దార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఈనెల 23 నుంచి 25 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా జట్టు పాల్గొన్నారు. పోటీల్లో క్రీడాకారులు ప్రతిభను కనబరిచి తృతీయస్థానం దక్కించుకున్నారు. వీరికి సర్టిఫికెట్లు, మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. క్రీడాకారులను కమలేష్, ఐటీబీపీ కలికిరి బెటాలియన్ కమాండెంట్ అమిత్‌ఏక్తాభాటియా, కోచ్‌లు మహేంద్ర, విజయ్, అంజనప్ప, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, అసోసియేషన్ సభ్యులు మహేంద్రనాయక్, అభిలాష్, రవీంద్రలు అభినందించారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

వాల్మీకిపురం : విశ్వమాత మదర్‌థెరిసా జయంతిని సోమవారం వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఉర్దూ మైనార్టీ గురుకుల పాఠశాలలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ మానవసేవే, మాధవసేవ అని నమ్మి తన జీవితాన్ని మొత్తం సేవకే అంకితం చేసిన త్యాగమూర్తి, పేద ప్రజల ఆత్మబంధువు మదర్ థెరిసా అన్నారు. కోల్‌కత్తాలో సేవాభావంతో జీవితం ఆరంభించిన మదర్‌థెరిసా దీనులకు పేదవారికి తన జీవిత పర్యంతం సర్వలం దించారని కొనియడారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు యాస్మిన్ భాను, విద్యార్థులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుచరణ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హెల్పింగ్‌మైండ్స్ సంస్థకు మదర్‌థెరిస్సా అవార్డు



అవార్డు అందుకుంటున్న అబూబకర్‌సిద్దిక్

మదనపల్లె సిటీ: హెల్పింగ్‌మైండ్స్ సంస్థ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి విజయవాడకు చెందిన మదర్ సర్వీస్ సొసైటీ మదర్‌థెరిస్సా అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం విజయవాడలో మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ =కు సొసైటీ అధ్యక్షులు మల్లాది ప్రసాదరావు అవార్డు, ప్రశంసాపత్రంను అందజేశారు. హెల్పింగ్‌మైండ్స్ అన్నమయ్య జిల్లాలో చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను అభినందించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం తంబళ్లపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్ పరిధిలో పార్టీ సభ్యత్వం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, లక్ష్మయ్య, సుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

మండల వాసి కువైట్లో మృతి



కువైట్లో మృతిచెందిన సుబహాన్

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రంకు చెందిన సుబహాన్ కువైట్‌లో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. చౌడసముద్రంకు చెందిన సుబహాన్(35) గత ఎనిమిదేళ్లుగా కువైట్‌లో ఉంటున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు మొహమ్మద్, ఆహిద్, ఆయాన్ ఉన్నారు. మూడు నెలల క్రితం ఇంటికి వచ్చి తిరిగి కువైట్‌కు వెళ్ళాడు. కువైట్‌లోని అతని నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న సుహాన్‌ను తోటి వారు గమనించి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు వారు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందినట్లు కువైట్ నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపినట్లు చెప్పారు. సుబహాన్ మృతి పట్ల కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో రూ.12 కోట్లతో రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే పాడిరైతులకు షెడ్ల నిర్మాణానికి ప్రవేశపెట్టిన గోకులం పథకం కింద 25 షెడ్లను దరఖాస్తు చేసుకున్న వారికి అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో రోడ్లు, మౌలికవసతుల కల్పన కోసం నెలరోజుల్లో రూ.50 కోట్లు తెప్పించి ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. రోడ్లు వెడల్పుచేసి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కోమటివానిచెరువు నిండిపోవడంతో సప్లై ఛానల్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించి ముంపునకు గురికాకుండా చూశామన్నారు. కోమటివానిచెరువులోకి మురుగువ్యర్థాలు రానివ్వకుండా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, కోమటివానిచెరువులోని నీటిని శుద్ధిచేసి బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని రామ్‌నగర్ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వైభవంగా మహాకుంభాభిషేకం

రామసముద్రం: రామసముద్రం మండలం మూగవాడి గ్రామంలో వెలసిన పురాతన శ్రీపుండీశ్వరస్వామికి శ్రావణ సోమవారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రాలతో ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం గోపూజ, మహాకుంభాభిషేకం, కలశారాధన, వేద పఠనం చేసి , పూర్ణాహుతి నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు.



మూగవాడిలో స్వామివారికి కలశాలు తీసుకొస్తున్న దృశ్యం

వివేకానంద ఫౌండేషన్‌కు అవార్డు

మదనపల్లె సిటీ: సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు వివేకానంద ఆశయం ఫౌండేషన్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుకు ఎంపికైంది. తిరుపతిలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతపాటియా వెంకటాచారి వివేకానంద ఆశయం వ్యవస్థాపకులు గుంపు భానుప్రకాష్‌కు అవార్డు అందజేశారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసి రక్తదానం, ఆహార సరఫరా, పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, ప్లాంటేషన్ వంటి సేవా కార్యక్రమాలను వెయ్యికిపైగా నిర్వహించినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు వెంకటాచారి తెలిపారు.



అవార్డును అందుకుంటున్న భానుప్రకాష్

మార్కెట్ యజమానులు నిబంధనలు పాటించాలి

ములకలచెరువు; స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని టమాట మండీ యజమానులు నిబంధనలు పాటించాలని సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రి, తంబళ్లపల్లె టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో మండీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ... రాత్రి 12 గంటల లోపు లోడింగ్, అన్‌లోడింగ్ పూర్తి చేయాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా మండీ యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు.



మండీ యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు